తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
03-07-2024
బుధవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 309 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
జయభేరి

# తొలగించిన అంశాలను పునరుద్ధరించండి



**జయభేరి, న్యూఢిల్లీ జూలై 2:**

ప్రతిపక్ష నాయకుడిగా తాను లోక్ సభలో చేసిన ప్రసంగం నుంచి తొలగించిన అంశాలను పునరుద్ధరించాలంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు మంగళవారం లేఖ రాశారు. స్పీకర్ ఏరికోరి కొన్ని అంశాలను కావాలనే తొలగించారని కూడా రాహుల్ గాంధీ ఆరోపించారు.'' నేను మీ దృష్టికి అనురాగ్ ఠాకుర్ ప్రసంగం విషయాన్ని కూడా తీసుకు రావాలనుకుంటున్నాను. ఆయన ప్రసంగం అంతా ఆరోపణలతో కూడుకున్నవి. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఒకే ఒక పదాన్ని తొలగించినట్లు ఆయన చెప్పారు. కానీ ఏరికోరి అనేక అంశాలు తొలగించారు'' అని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు.స్పీకర్ చర్య లోక్ సభ నియమాలకు వ్యతిరేకంగా ఉందని కూడా రాయ్ బరేలి ఎంపీ అయిన రాహుల్ గాంధీ విమర్శించారు.

'' రూల్ 380 కింద మీరు తొలగించిన అంశాలు రావు, ఇక సభలోని ప్రతి సభ్యుడికి తన వాదనను వినిపించే హక్కు రాజ్యాంగం లోని ఆర్టికల్ 105(1) కల్పించింది. ప్రజల అంశాలను సభలో లేవనెత్తే హక్కు ప్రతి సభ్యుడికి ఉంది'' అని రాహుల్ గాంధీ తెలిపారు.

ఇంకా ''స్పీకర్ చర్య పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విలువలకు వ్యతిరేకంగా ఉన్నాయి. అందుకనే నా ప్రసంగం నుంచి తొలగించిన అంశాలను పునరుద్ధరించాలి'' అన్నారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో నీట్ పరీక్ష అక్రమాలు, బిజెపి, మోడీ ,ఆర్ఎస్ఎస్, హిందూ మతం, అగ్నివీర్ వంటి పలు అంశాలపై ప్రసంగించారు. 'జై సంవిధాన్' అంటూ చర్చను ప్రారంభించిన రాహుల్ గాంధీ దాదాపు ఒక గంట 40 నిమిషాల పాటు ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తున్నంత సేపు కేంద్ర మంత్రులు, ఎంపీలు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనకు రంగం సిద్ధమైంది. త్వరలోనే జిల్లాల వారీగా పర్యటించి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుంటానని, అధికారుల పనితీరును ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తానని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్లు చాలా వరకు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి... ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు కూడా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని ఆదేశించారు. ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.

# త్వరలో జిల్లాల పర్యటన

**జయభేరి, హైదరాబాద్ :**

"తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దటంలో అధికారుల పాత్ర ఎంతో ఉంటుంది. మీ శాఖల పనితీరు మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలతో పని చేయాలి. ప్రతి అధికారి కనీసం ఓ ఫ్లాగ్ షిప్ ఐడియాను 2 వారాల్లో ప్రభుత్వానికి సూచించాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీల్లో అయిదు అమలు చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా తర్వాత వంద రోజులు ప్రభుత్వ కార్యక్రమాలు ఆగిపోయాయి. ఇక నుంచి అధికారులు పరిపాలనపైనే దృష్టి సారించాలి. అనేక మంది సీఎంలతో పనిచేసిన అనుభవం కలిగిన అధికారులు కీలక విభాగాల్లో ఉన్నారు. అయితే వారి పనితీరు ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు ఉండాలి." అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.



# మునిసిపల్ అధికారిపై ఎమ్మెల్యే ఫైర్

**జయభేరి, మేడ్చల్:**

టౌన్ ప్లానింగ్ ఏసిపి వెంకట రమణ అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారంటూ పై ఉప్పల్ ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. ఉప్పల్ జీహెచ్ ఎంసీ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. అలసత్వం వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసిపి వెంకటరమణపై ఎమ్మెల్యే గరం గరంఅయ్యారు. పేదలకు ఒకరకంగా, పెద్దలకు ఒకరకంగా టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారంటూ అక్రమ కట్టడాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల అలసత్వానికి ఎమ్మెల్యే క్లాస్ తీసుకున్నారు. ఉప్పల్ అభివృద్ధికి తోడ్పటుగా ఉంటూ ప్రజా సమస్యలు తీర్చడానికి అధికారులు ముందు ఉండాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు జీహెచ్ ఎంసీ కి ఆదాయం వచ్చే విధంగా అధికారులు వ్యవహరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు.

...మిగతాది 3 లో



# టీజీఎస్ఆర్టీసీలో 3035 కొలువులు

- భర్తీకి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం
- మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం
- కొత్త రక్తంతో ఆర్టీసీని మరింతగా బలోపేతం చేస్తామని వెల్లడి

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ)లో ఖాళీగా ఉన్న 3035 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపిన అన్ని పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ 3035 పోస్టుల్లో 2000 డ్రైవర్, 743 శ్రామిక్, 114 డిప్యూటీ

...మిగతాది 2 లో

# కమలంలో ఇమడ లేకపోతున్న ఈటెల

**జయభేరి, హైదరాబాద్, జూలై 2:**

ఈటల రాజేందర్ మావోయిస్టు ఉద్యమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర మంత్రి అయ్యారు. బీఆర్ఎస్ లో ఉద్యమకాలం నుంచి పనిచేసి కేసీఆర్ కు చేదోడు వాదోడుగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించక ముందు కూడా కేసీఆర్ ఈటల రాజేందర్ కు ప్రయారిటీ ఇచ్చారు. శాసనసభలో పార్టీ నేతగా అవకాశం కల్పించారు. అలా ఈటల రాజకీయ ప్రస్థానం మొదలయింది. 2014లో బీఆర్ఎస్ లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈటల రాజేందర్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలకంగా మారారు. ఆయన బీసీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు ఉద్యమం నుంచి రావడం, మంచి వాగ్ధాటి ఉండటంతో ఆయనకు అవకాశాలు

...మిగతాది 2 లో





# రాత్రి 12 గంటల నుంచి పెరుగనున్న రీచార్జీ ధరలు

**జయభేరి, న్యూఢిల్లీ జూలై 2:**

దేశంలో జియో, ఎయిర్ టెల్ వంటి టెలికామ్ దిగ్గజ టెలికామ్ కంపెనీలు ఈ రోజు రాత్రి 12 గంటల నుంచి రీచార్జీ ధరలు పెంచేస్తున్నాయి. కానీ మీరు ఇప్పుడు రీచార్జీ చేస్తే పెరిగే ధరల భారం నుంచి తప్పించుకోవచ్చు. మీ ప్లాన్ యాక్టివ్ గా ఉన్నా సరే నేటి రాత్రి 12.00 గంటల లోపు ఎప్పుడైనా రీచార్జీ చేసుకోండి. జియో, ఎయిర్ టెల్ యూజర్లకు అడ్వాన్స్ గా రీచార్జ్ చేసుకునే వెసలు బాటు ఉంది. మిగతా వారికి ఈ అవకాశం లేదన్న విషయం గుర్తుంచుకోండి.జియో సబ్స్క్రైబర్లు ఏ ప్లాన్ అయినా ముందుగానే రీచార్జ్ చేయవచ్చు, కానీ ఎయిర్ టెల్ సబ్స్క్రైబర్లు మాత్రం ప్రస్తుతం యాక్టివ్ గా ఉన్న ప్లాన్ తోనే రీచార్జీ చేసుకోవాల్సి ఉంటుంది. వొడాఫోన్ఐడియా యూజర్లు ఇలా ముందుగా రీచార్జ్ చేసుకోలేరు, వారు మాత్రం భారాన్ని భరించాల్సిందే.



# వసూళ్ల రాణి

**జయభేరి, గుంటూరు, జూలై 2:**

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేట నియోజకవర్గం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారుతోంది. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ ఐదేళ్లు మంత్రిగా కొనసాగి సీనియర్లకు కూడా షాక్ ఇచ్చారు విడదల రజినీ. అధికారం అండతో మాజీ మంత్రి నియోజకవర్గంలో ప్రజలను ఏ రకంగా ఇబ్బందులు పెట్టారోనని ఒక్కో ఘటన వెలుగులోకి వస్తున్నాయి. ప్రజా ప్రతినిధిని అనే విషయం మర్చిపోయి తన అనుచరులు తన కుటుంబీకులతో రాచరికపు పరిపాలన సాగించిందని స్వయంగా నియోజకవర్గ ప్రజలే చెప్పటం ఇప్పుడు అందరిని నోటిన వేలు వేసుకునేలా చేస్తుంది.

...మిగతాది 2 లో

ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇమడ లేకపోతున్న ఈటెల

అనుకోకుండానే తరముకుంటూ వచ్చాయంటారు. అయితే 2018లో రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈటల రాజేందర్ కు, కేసీఆర్ కు మధ్య గ్యాప్ పెరిగింది. పార్టీ నాయకత్వంపైనే నెగిటివ్ కామెంట్స్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ఈటల రాజేందర్ ను మంత్రి వర్గం నుంచి కేసీఆర్ తప్పించారు. వెనువెంటనే పార్టీ పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ఈటల అప్పుడు జరిగిన ఉప ఎన్నికలలో విజయం సాధించారు. ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీలోనూ నెంబర్ వన్ పొజిషన్ లో ఉండాలన్నది ఈటల రాజేందర్ కోరికలా ఉంది. అయితే ఆ పార్టీలో ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవాళ్లు, కింది స్థాయి నుంచి పైకి వచ్చిన నేతలు అనేక మంది ఉన్నారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ నుంచి రెండుచోట్ల పోటీ చేసిన ఈటల రాజేందర్ ఓటమిపాలయ్యారు. దీంతో ఆయన తిరిగి పదవిలో ఉండేందుకు లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఆయన కోరుకున్నట్లుగానే మల్కాజ్‌గిరి నియోజకవర్గం అభ్యర్థిగా పార్టీ ఎంపిక చేసింది. అప్పటి వరకూ ఉన్న నేతలను పక్కన పెట్టి అధినాయకత్వం ఆయనకు టిక్కెట్ ఇచ్చింది. మొత్తం మీద ఈటల రాజేందర్ మల్కాజ్‌గిరి నియోజకవర్గం ఎంపీగా గెలిచారు. అయితే ఆయన కేంద్ర మంత్రి పదవిని ఆశించారు. కానీ మోదీ సర్కార్ లో మాత్రం ఆయన ఆశించింది జరగలేదు. కేంద్ర మంత్రివర్గంలోకి కిషన్ రెడ్డిని, బండి సంజయ్ ను మోదీ తీసుకున్నారు. కె. లక్ష్మణ్ లాంటి సీనియర్ నేతలున్నప్పటికీ వాళ్లిద్దరూ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారని భావించి మోదీ వాళ్లిద్దరికే కేబినెట్ లో చోటు కల్పించారు. ఇప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఈటల రాజేందర్ ఆశిస్తున్నట్లు కనపడుతుంది. మంత్రి పదవి దక్కకపోయినా కేంద్రంలో అధికారంలోకి మళ్లీ రావడంతో రాష్ట్ర అధ్యక్ష పదవిని చేపట్టాలని ఆయన ఉవ్విళ్లూరుతున్నారు. అయితే బీజేపీ అధ్యక్ష పదవి కోసం అనేక పేర్లు వినిపిస్తున్నాయి. డీకే ఆరుణ, ధర్మపురి అరవింద్ వంటి పేర్లు కూడా వినిపిస్తుండటంతో ఈటల కొంత అసహనం ఫీలవుతున్నారని ఆయన మాటలను బట్టి వ్యక్తమవుతుంది. మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ బీజేపీ అధ్యక్షుడిగా ఏ ఫైటర్ కావాలి.. స్ట్రీట్ ఫైటరా.. రియల్ ఫైటరా.. అంటే ప్రశ్నించారు. ఐదుగురు ముఖ్యమంత్రులతో తాను కొట్లాడానంటూ తనకు తానే గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేశారు. సందర్భం వచ్చినప్పుడు కుంభస్థలాన్ని కొట్టే దమ్మున్నోడు కావాలని.. గల్లీల్లో కొట్లాడేవాళ్లు కాదని అంటూ మిగిలిన నేతలను కించపర్చే విధంగా మాట్లాడటంపై కొందరు నేతలు హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మొత్తం మీద ఈటల రాజేందర్ ఇక్కడ కూడా ఇమడలేకపోతున్నట్లే కనిపిస్తుంది.

## టీజీఎస్ఆర్టీసీలో 3035 కొలువులు

సూపరింటెండెంట్ (మెకానిక్), 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 23 అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్), 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్), 7 మెడికల్ ఆఫీసర్ (జనరల్), 7 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్) కొలువులు ఉన్నాయి. ఆర్టీసీలో వివిధ కేటగిరిల్లో 3035 పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు టీజీఎస్ఆర్టీసీలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ప్రజా రవాణా వ్యవస్థకు పెద్ద పీట వేస్తూ తమ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తోందని అన్నారు. ఈ కొత్త రక్తంతో రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా బలోపేతం చేస్తామని చెప్పారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త బస్సులను సంస్థ కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఈ కొత్త బస్సులకు అనుగుణంగా నియమకాలు చేపడుతున్నట్లు వివరించారు. వీలైనంత త్వరగా 3035 పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

## వసూళ్ల రాణి

రజినీతో పాటు.. ఆమె మరిది గోపి, పీఏ రామకృష్ణ ఆగడాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి.ముందుగా రజినీపై.. పసుమర్రు రైతులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జగనన్న కాలనీ భూముల్లో ఆమె భారీ స్కామ్‌కు పాల్పడినట్లు వారు తెలిపారు. జగనన్న కాలనీ పేరుతో రైతుల నుంచి 200 ఎకరాల భూ సేకరణ చేశారని ఆరోపించారు. భూ సేకరణలో తమ వద్ద కొన్న ప్రతి ఎకరానికి రెండున్నర లక్షలు చొప్పున విడుదల రజని టీమ్ లంచం తీసుకున్నారని ఆరోపించారు. రజినీ కాజేసిన డబ్బులను రికవరీ చేయాలని వారు కంప్లైట్ లో కోరారు. అలానే బాధితులంతా కలసి.. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి.. రజినిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం కూడా అందజేశారు.ఊహించని రీతిలో రైతులు ఒక్కసారిగా ఎదురుతిరగడంతో.. తమ తప్పులు సరిదిద్దుకున్నారు రజినీ. పసుమర్రు రైతుల నుంచి తీసుకున్న భూములకు మొత్తం 32 మంది రైతులకి ఒక కోటి 16 లక్షల రూపాయలను మధ్యవర్తుల ద్వారా విడుదల రజనీ ఫ్యామిలీ చెల్లించినట్లు తెలుస్తోంది. కేసులకే భయపడే విడదల రజనీ డబ్బులు ఇచ్చేరని బాధిత రైతులు అంటున్నారు. అయితే తిరిగి ఇచ్చిన డబ్బులో కూడా కొందరు చేతివాటం చూపారని.. మిగతా డబ్బును కూడా ఇప్పించాలని ఆవేదన వ్యక్తం చేశారు.పసుమర్రు రైతులను ఆదర్శంగా తీసుకున్న గుదేవారిపాలెం రైతులు సైతం ప్రస్తుతం రజనీపైన ఫిర్యాదుకు సిద్ధమయ్యారు. జగనన్న కాలనీ కోసం తీసుకున్న తమ భూములకు పరిహారంగా ఇచ్చే డబ్బుల్లో కూడా కమిషన్ రూపంలో నాలుగు లక్షల వసూలు చేశారంటూ గోడు వెళ్లబోసుకున్నారు. అందుకు గాను రజినీ పీఏ రామకృష్ణకు మధ్యవర్తిగా శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి వ్యవహరించినట్టు బాధితులు చెబుతున్నారు. మరోవైపు టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు వద్దకు రజినీ బాధితులు క్యూ కడుతున్నారు. చిలకలూరిపేట టౌన్ లో స్థలాన్ని ఆక్రమించారంటూ మరో బాధితుడు కూడా ఎంపీకి ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. అలానే పట్టణ పరిధిలో పెట్రోల్ బ్యాంక్ ఉన్న స్థలాన్ని ఆక్రమించి బెదిరింపులకు పాల్పడుతున్నారని విడదల గోపీనాథ్ పై ఫిర్యాదు చేయడం కలకలంగా మారింది.పోలీసు వ్యవస్థల్ని సైతం చిన్నాభిన్నం చేయటమే కాకుండా ప్రజలకు రక్షణగా ఉండాల్సిన వారిని.. తమకు రక్షకులుగా మార్చుకొని పరిపాలన సాగించారని ప్రజలు వాపోతున్నారు. నియోజవర్గంలో బిజినెస్ చేయాలంటే ప్రభుత్వానికి చెల్లించే టాక్స్ కాకుండా విడుదల రజిని కుటుంబానికి సంబంధించి గాని విడుదల రజిని చుట్టూ ఉండే అంగరక్షకులకైనా ముడుపులు చెల్లించాలని అంటున్నారు. ఇందుకు యడ్లపాడులోని లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ ఘటనే ఉదాహరణగా నిలుస్తోంది. 2010 నుంచి లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ నడుస్తోండగా.. వ్యాపారాన్ని నడిపించుకోవడానికి డబ్బులు వసూలు చేశారంటూ నరసరావుపేట డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. స్టోన్ క్రషర్ కొనసాగాలంటే 5 కోట్లు ఇవ్వాల్సిందేనని రజని పీఏ రామకృష్ణ హెచ్చరించగా.. అంత ఇవ్వలేమంటూ చెప్పగా.. డబ్బులు ఇవ్వకపోతే అంతు చూస్తామంటూ బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతటితో ఆగకుండా స్టోన్ క్రషర్‌ను పరిశీలించడానికి వచ్చిన అప్పటి విజిలెన్స్ ఎస్పీ జాషువా.. అవకతవకలు జరిగాయని రూ.50 కోట్లు కట్టాలంటూ బెదిరించారని అంటున్నారు. ఇక విడదల రజని పీఏను కలిసి సెటిల్మెంట్ చేయమని కోరగా.. రూ.5 కోట్లు ఇస్తేనే కేసు మాఫీ చేస్తామని చెప్పారని.. బాధితులు వాపోయారు. అయితే తమకు డబ్బులే కావాలంటూ రామకృష్ణ పట్టుబట్టడంతో..కొంత టైమ్ కావాలంటూ వచ్చేశామని తెలిపారు. ఆ తర్వాత విడుదల రజని మరిది విడదల గోపిని ఆశ్రయిస్తే.. రజనికీ రూ.2 కోట్లు, జాషువా కు రూ.10 లక్షలు, తనకు రూ.10 లక్షలు ఇచ్చేలా డీల్ సెట్ చేసినట్టు బాధితులు చెబుతున్నారు. ఏప్రిల్ 4, 2021న గోపికి డబ్బులు అందించామంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు బాధితులు. ఎమ్మెల్యేగా తనకున్నటువంటి పవర్స్ ని నియోజకవర్గ అభివృద్ధికి కాకుండా తాను రాజకీయంగా ఎదగటానికి మాత్రమే రజినీ ఉపయోగించుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తనకు తానే తన చుట్టూ ఒక కంచెను ఏర్పాటు చేసుకొని సామాన్యులకు ఆ కంచె దాటి వెళ్లే పరిస్థితి లేకుండా చేశారని.. అదే కాకుండా నియోజకవర్గంలో ప్రతీ పనిలోనూ రజినీ కుటుంబ సభ్యులు వేలు వేలు పెట్టడం.. పరోక్షంగా తామే ఎమ్మెల్యేలుగా భావించి అధికారాన్ని వినియోగించడం.. ఆమె ఓటమికి కారణమయ్యాయని అంటున్నారు. నియంతగా మారిన రాజుల్ని ప్రజలు ఎలా తరిమికొట్టారో.. అదే విధంగా ప్రస్తుతం చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలు సైతం రజినీ పేరు చెప్తే అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారని తెలుస్తోంది.2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి బరిలోకి దిగిన రజినీ.. 2024 ఎన్నికల్లో మాత్రం గుంటూరు వెస్ట్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పార్టీ కార్యకర్తలు సైతం ఆమెను కలవాలంటే మూడు అంచల కంచెని దాటాల్సిన పరిస్థితులు ఉండేవని అంటున్నారు. ఆమె గెలుపు కోసం పనిచేసిన సొంత పార్టీ నేతలే రజినీ చేసిన అరాచకాల గురించి వాపోతుండడం మరింత చర్చనీయాంశం అవుతోంది. ప్రజలు, మీడియా కానీ మాజీ మంత్రిని సంప్రదించాలన్నా.. ముందుగా తన చుట్టూ ఉండే కొతారిలోని పిఏ లను సంతృప్తి చేస్తే తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉండేదనేది పార్టీ వర్గాల్లో ఓపెన్ సీక్రెట్ గా నడిచింది.

# తెలంగాణలో పడకేసిన పాలన

▶▶ తెలంగాణభవన్ లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రెస్ మీట్ లో మాట్లాడారు.



**జయభేరి, హైదరాబాద్:** కాంగ్రెస్ ఏడు నెలల పాలనలో గ్రామాలు, పట్టణాల్లో పాలన పడకేసింది. గ్రామాల అభివృద్ధి ముఖ్యమని కేసీఆర్ గారు పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు చేపట్టారు. పారిశుధ్యం పడకేసింది. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నది. ఏడు నెలల్లో నయా పైసా కూడా పల్లె, పట్టణాలకు విడుదల చేయలేదు. మేము ప్రతి నెలా నిధులు విడుదల చేశాం. బి ఆర్ ఎస్ పాలనలో పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. సర్పంచుల కాలం ముగిసింది. జిల్లా పరిషత్ కాలం ముగుస్తున్నది. ఎన్నికలు నిర్వహించలేదు. నాడు 87 ట్రాక్టర్లు మాత్రమే ఉంటే, నేడు 12,769 పంచాయతీల్లో ట్రాక్టర్లు. దీనదాయల్, సంసద్ ఆదర్శ యోజన అవార్డులు తెలంగాణకు వచ్చాయి. కాంగ్రెస్ పాలనలో పల్లెలు కన్నీరు పెడుతున్నాయి. అస్తవ్యస్తం అవుతున్నాయి. ట్రాక్టర్లు మూలన పడ్డాయి. పెట్రోల్ కూడా పోయించే పరిస్థితి లేక అధికారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ టాక్స్ లేదు, బీమా లేదు అని ట్రాక్టర్లు సీజ్ చేస్తున్నరు. పంచాయతీ సెక్రటరీలు చెప్పినా అధికారులు వినడం లేదు. సొంత డబ్బులు పెట్టి పంచాయతీ సెక్రటరీలు డీజిల్ పోయిస్తున్నారు. బుగ్గలు పెడుతున్నరు. పారిశుధ్య కార్మికులు 7 నెలలు జీతాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంట్ బిల్లులు కట్టడం లేదు. ట్రాక్టర్ ఇన్స్టాల్మెంట్ కట్టడం లేదు. గ్రామ పాలన అస్తవ్యస్తం అయ్యింది. పంచాయతీల్లో డబ్బులు లేక చెత్త ఎక్కడిక్కడ పేరుకు పొయ్యింది. స్పెషల్ డ్రైవ్ కాదు, ఉన్న చెత్త ఎత్తుకోవడం లేదు. ప్రజా పాలనలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వరా? జీతాలు లేకుండా వాళ్లు ఎలా బతుకుతారు? ఎందుకు సమీక్షలు చేయడం లేదు. సమయం ఉండటం లేదా. చివరకు గవర్నర్ ను కలిసి సర్పంచులు వినతి ఇచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. వానాకాలం వచ్చింది. పంచాయతీల్లో డబ్బులు లేక ట్రాక్టర్ డీజిల్ పైసలు లేవు, ఫాగింగ్ లేదు, విద్యుత్ నిర్వహణ లేదు. మేము ప్రతి నెలా రూ. 275 కోట్లు, ఏటా రూ. 3330 కోట్లు పల్లెల్లో అభివృద్ధి కోసం ఇచ్చాం. పట్టణాలకు ఏటా 1700 కోట్లు ఇచ్చేవాళ్ళం. మీరు ఏడు నెలల్లో ఎందుకు ఏడు పైసలు ఇవ్వలేదు. స్థానిక సంస్థలను ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారు. మలేరియా, డెంగీ వైరల్ జ్వరాలు ప్రభలితే బాధ్యత ఎవరిది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి నిధులకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశాం. పల్లె, పట్టణ ప్రగతి కోసం 20 వేల కోట్లు ఖర్చు చేశాము. ఎంత దారుణం అంటే ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు కూడా జీతం రాలేదు. రిటైర్మెంట్ శాలువాలు కప్పుకొని జీతాలు రాలేదు అని అంటున్నారు. తక్షణం పారిశుద్ధ్య కార్మికులకు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజా పాలన, ఇందిరమ్మ పాలన అంటే ఇదేనా? అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడి అని పోస్ట్ పెట్టి కృషి చేస్తే నిర్వీర్యం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, చేసిన పనులకు గాను సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు ప్రభుత్వ నిధులు విడుదల చేయాలి. పారిశుద్ధ్య కార్మికులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పెండింగ్ జీతాలు విడుదల చేయాలని అన్నారు.

వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉంది కాబట్టి, గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి, పారిశుద్ధ్యం పెంపొందించాలి. నిరుద్యోగులను నిలువున ముంచారు. సంక్షేమాన్ని సమాధి కట్టారు. క్షలు తప్ప పింఛన్లు లేవు. చంద్రబాబు బకాయిలతో కలిపి 4 వేల ఫించన్ ఇస్తే, ఇచ్చేవి ఇవ్వడం లేదు. పెంచడం లేదు. రెండు నెలల ఆసరా పింఛను వెంటనే విడుదల చేయాలి. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన పాపానికి ఆత్మహత్య చేసుకుంటున్న అని ఒక రైతు ప్రభాకర్ ఖమ్మంలో చనిపోయారు. ఎంతో బాధ వేసింది. ఆయన ఆత్మహత్య బాధాకరం. వీడియో చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. రాష్ట్రంలో ఎంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. ప్రభాకర్ తండ్రి పోలీసు స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేస్తే తీసుకోవడం లేదు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా తయారైంది. ప్రభాకర్ చావుకు కాంగ్రెస్ పాలన కారణం. ఎస్సై, ఎమ్మార్వో, కలెక్టర్ వీరిలో ఎవరు పట్టించుకున్నా న్యాయం జరిగేది. ఏ రైతు ప్రాణాలు కోల్పోవద్దు. ప్రశ్నించే బాధ్యతను ప్రజలు మాకు అప్పగించారు. మీకు ఏదైనా కష్టం ఉంటే అధికారులకు చెప్పండి. వారు వినకుంటే మాకు చెప్పండి. మీ తరుపున పోరాటం చేస్తం. అండగా ఉంటాం. చావుకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయకుండా, వీడియో తీసిన వారి మీద కేసులు పెడతారట. ఆ రైతు నేరుగా మీ పేరు చెప్పారు రేవంత్ రెడ్డి గారు. ఆ రైతు తరుపున రేవంత్ రెడ్డి కి చెబుతున్నాం అరెస్టు చేసి కేసులు పెట్టి, ఆయన భూమి ఆయనకు అప్పగించాలి. ప్రభాకర్ కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేసియా, కుటుబంలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. వాస్తవాలు తెలిసేలా, బాధ్యులైన అధికారుల పై చర్యలు తీసుకునేలా ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర విభజన సమస్యల మీద లేఖ రాశారు సంతోషం. రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్ళలో 7 మండలాలు, లోయర్ సీలేరు ఏపీలో కలిపారు. కెసిఆర్ నాడు తీవ్రంగా స్పందించి, నిరసన తెలిపారు. బిల్లు పెట్టింది బిజెపి, మద్దతు ఇచ్చింది కాంగ్రెస్. మీ సహచరుడు మీదనే ఎన్డీయే ప్రభుత్వం ఆధారపడింది. చంద్రబాబు మీద ఒత్తిడి చేసి 7 మండలాలు, లోయర్ సీలేరు మనకు వచ్చేలా చేయాలి. ఆ తర్వాత విభజన హామీల గురించి మాట్లాడాలని అన్నారు.

# చంద్రబాబు ఇంటికి లంచం
## అధికారి అరెస్ట్...



**జయభేరి, తిరుపతి, జూలై 2:** రాష్ట్రంలో కొంతమంది అధికారులు అవినీతి పతాక స్థాయికి చేరిపోయింది. అవతల వ్యక్తులు ఎవరన్నదానితో సంబంధం లేకుండా చేయి తడిపితే గాని పని చేయని స్తితికి అధికారులు దిగజారిపోయారు. రోజువారీ కలెక్షన్లు లక్ష్యంగా పెట్టుకుని చాలామంది అధికారులు పని చేస్తున్నారు. ఆ లక్ష్యాలను చేరితే గాని ఇంటికి వెళ్ళని అధికారులు రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంతోమంది ఉన్నారు. అటువంటి అధికారులకు సంబంధించిన వ్యవహారమే తాజాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిత్తూరు జిల్లా కుప్పంలోని ప్రస్తుత సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇంటి స్థలాన్ని సబ్ డివిజన్ చేసేందుకు ఓ డిప్యూటీ సర్వేయర్ లంచం డిమాండ్ చేసి తీసుకున్నారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ శివపురం వద్ద స్థలాన్ని కొంత స్థలాన్ని చంద్రబాబు నాయుడు కొనుగోలు చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ భూముల్లో గృహ నిర్మాణం చేసేందుకు తెలుగుదేశం నాయకులు భూ వినియోగ మార్పిడికి దరఖాస్తు చేశారు. స్థలాన్ని సబ్ డివిజన్ చేయాలని కోరారు. ఇందుకోసం డిప్యూటీ సర్వేయర్ సద్దాం హుస్సేన్ రూ.1.85 లక్షల లంచాన్ని డిమాండ్ చేశారు. ఆ మొత్తం ఇస్తేనే గాని ప్రక్రియ చేపట్టనని తేల్చి చెప్పడంతో.. స్థానిక నాయకులు అందుకు అవసరమైన మొత్తాన్ని చెల్లించారు. ఆ తరువాత ఫైల్ ముందుకు కదిలింది.

ఈ విషయాన్ని అప్పట్లో టీడీపీ నాయకులు కూడా బయట పెట్టలేదు.డిప్యూటీ సర్వేయర్ లంచం తీసుకున్న విషయాన్ని తాజాగా తెలుగుదేశం పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత నెల 25, 26 తేదీల్లో చంద్రబాబు నాయుడు కప్పం పర్యటనకు వచ్చారు. అప్పుడు ఆయనను ఆర్ అండ్ బి అతిథి గృహంలో పలువురు నాయకులు కలిశారు. డిప్యూటీ సర్వేయర్ పాల్పడిన అవినీతి వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి ఆ నాయకులు తీసుకువెళ్లారు. దీనిపై షాక్ కు గురైన సీఎం చంద్రబాబు నాయుడు.. అక్కడే ఉన్న కలెక్టర్ సుమిత్ కుమార్, సంయుక్త కలెక్టర్ శ్రీనివాసుల దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లారు.సర్వే శాఖ ఏడి గౌస్ భాషాతో శాఖ పరమైన విచారణ చేయించగా డబ్బులు తీసుకున్న మాట వాస్తవమేనని తేలింది. అలాగే, భూ సర్వే కోసం సద్దాం హుస్సేన్ లక్ష డిమాండ్ చేశారని గత నెల 27న శాంతిపురం మండలానికి చెందిన ఓ రైతు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపైనా విచారణ జరిపిన అధికారులు అది కూడా నిజమేనని నిర్ధారించారు. ఈ అంశాలపై సాయంత్రానికల్లా నివేదిక ఇవ్వాలని జెసి శ్రీనివాసులు సర్వే ఏడిని సోమవారం ఆదేశించారు. దీనికి సంబంధించిన నివేదికను సోమవారం సాయంత్రం జెసి శ్రీనివాసులకు సర్వే శాఖ అధికారులు అందించగా.. లంచం తీసుకున్న డిప్యూటీ సర్వేయర్ ను సోమవారం రాత్రి సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ వ్యవహారం సంచలనంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థలానికి సంబంధించి పని చేసేందుకు కూడా డబ్బులు వసూలు చేసే స్థాయికి అధికారులు వెళ్లిపోవడాన్ని చూస్తుంటే.. క్షేత్రస్థాయిలో అవినీతి వ్యవహారాలు ఏస్థాయికి వెళ్ళిపోయాయో అర్థం అవుతోందని పలువురు పేర్కొంటున్నారు.సీఎం చంద్రబాబు నాయుడు ఈ తరహా అధికారులపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా రైతులు, సాధారణ ప్రజలను కొంతమంది అధికారులు అవినీతికి అలవాటు పడి తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.




# ములుగు జిల్లా మార్పు పేరు కోసం..

**జయభేరి, వరంగల్, జూలై 2:** ములుగు జిల్లాకు సమ్మక్క సారలమ్మ పేరు పెట్టేందుకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభమైంది. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రతిపాదన మేరకు ములుగు జిల్లా పేరును 'సమ్మక్క సారలమ్మ ములుగు'గా మార్చేందుకు సర్కారు ఈ నిర్ణయం తీసుకోగా.. మంగళవారం జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు.ఈ మేరకు ఎక్కడికక్కడ గ్రామ సభలు నిర్వహించాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారి ద్వారా మండల స్థాయి అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు.జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్రంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేయగా.. రెండో విడతలో నారాయణ పేటతో కలిపి ములుగును 2019 ఫిబ్రవరి 16న అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేశారు. అంతకుముందు వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో ఉండగా.. తొమ్మిది మండలాలు, దాదాపు 3 లక్షల జనాభాతో ములుగు జిల్లా ఏర్పాటైంది. దీని పరిధిలో ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వెంకటాపురం, వాజేడు మండలాలు ఉండగా.. వాటి పరిధిలో మొత్తంగా 336 గ్రామాలు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల పరిధిలో మంగళవారం ఉదయం నుంచే గ్రామ సభలు నిర్వహించనున్నారు.దాని ప్రకారం అధికారులు ముందుగా ములుగు జిల్లా రాజపత్రం అధికారిక ప్రచురణ ఫామ్ నెం.1 ని అన్ని గ్రామాల్లో నోటీస్ బోర్డుపై అతికించాలి. ప్రజల అభిప్రాయాలను మినిట్స్ రూపంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, సెక్రటరీ ఇద్దరూ ధృవీకరించాలి. ఆయా గ్రామ సభలను మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), మండల పంచాయతీ అధికారులు (ఎంపీవోలు) పర్యవేక్షించాలి. గ్రామ సభ పూర్తి అయిన తరువాత తీర్మాన పత్రాన్ని మండల స్థాయి అధికారులు మినిట్స్ రూపంలో జిల్లా ఆఫీసర్లకు అందజేయాల్సి ఉంటుంది.దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళా గా పిలుచుకునే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ములుగు జిల్లాలోనే జరుగుతుంది. దీంతోనే ములుగు ప్రత్యేక జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి సమ్మక్క సారలమ్మ పేరు పెట్టాలనే డిమాండ్ ఉంది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్క జిల్లాకు సమ్మక్క సారలమ్మ పేరు పెట్టేందుకు కృషి చేస్తానని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారు.ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి పేరు మార్పు ప్రతిపాదన పెట్టారు. మంత్రి సీతక్క చొరవతో వన దేవతలైన సమ్మక్క సారలమ్మ పేరుతో ములుగు జిల్లాకు నామకరణం చేయనుండగా, గ్రామ సభల నిర్వహణ అనంతరం గెజిట్ విడుదల చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

# అవినీతికి పాల్పడిన అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే

- అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఉప్పల్ ఎమ్మెల్యే

జయభేరి, ఉప్పల్ :

అధికారులు చిత్త శుద్ధితో పనిచేసి ఉప్పల్ నియోజకవర్గాన్ని రాష్ట్రం లోనే నంబర్ 1 నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు అన్నారు. మంగళ వారం ఉప్పల్ మున్సిపల్ కార్యాలయం లో ఉప్పల్ సర్కిల్ DC ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అన్ని విభాగాల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అందరూ తమ డివిజన్ల లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ మెంబర్ చిలుక నగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, EEనాగేందర్ తో పాటు వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







బండారి నీలం రెడ్డి అన్నకు పుట్టినరోజు శుభాకాంక్షలు.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలియజేసినవారు.. ఉప్పల్ మహిళా నాయకురాళ్లు అనిత రెడ్డి, ఎక్కిటి పద్మారెడ్డి, నస్రిన్, జయరెడ్డి, అనిత తదితరులు పాల్గొన్నారు.

జయభేరి, ఉప్పల్

## గుండ్లపోచంపల్లి కమీషనర్ శ్రీహరి




జయభేరి, మేడ్చల్ :

గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమీషనర్ గా శ్రీహరి భాద్యతలు చేపట్టారు. గత కమీషనర్ రాములు పదవి విరమణతో ఆ స్థానం ఖాళీగా మారడంతో కొంపల్లి మున్సిపల్ కమీషనర్ గా కొనసాగుతున్న శ్రీహరికి అదనపు భాద్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం నూతన కమిషనర్ శ్రీహరి కి పదవి విరమణ చేసిన రాములు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, డీఈఈ దుర్గాప్రసాద్, అధికారులు ప్రణతి, నర్సింహ్మారెడ్డి, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలతో స్వాగతం పలికారు.



## మంత్రి పదవికి సమర్థుడు మా బాలన్న

- వెనుకబడిన ప్రాంతం దేవరకొండ అభివృద్ధి బాలు నాయక్ తోనే సాధ్యం... ఇరగ దిండ్ల శ్రీశైలం

జయభేరి, దేవరకొండ :

ఎమ్మెల్యే నేనవత్ బాలునాయక్ ను మంత్రిగా నియమించాలని చందంపేట బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఇరగ దిండ్ల శ్రీశైలం ఒక ప్రకటనలో తెలియజేసినారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ లో లంబాడీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పదవికి బాలు నాయక్ తగిన సమర్థుడని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మారుమూల ప్రాంతమైన గిరిజన నియోజకవర్గం ఎక్కువగా ఎస్సీ.ఎస్టీ. బీసీ. మైనారిటీలు నిరుపేదలు ఎక్కువగా ఉండే నియోజకవర్గం దేవరకొండ అని అన్నారు. మారుమూల ప్రాంతమైన తెలంగాణ రాష్ట్రంలో దేవరకొండకు మంత్రివర్గంలో చోటు కల్పించలేదని, అన్ని వర్గాల వారికి న్యాయం చేకూర్చాలని దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధి కావాలి అంటే నేనావత్ బాలు నాయక్ కి గిరిజన కోటాలో మంత్రివర్గంలో చోటు కల్పించాలని తెలిపారు. నేనావత్ బాలునాయక్ సామాన్య కార్యకర్త నుంచి జడ్పిటిసిగా, మార్కెట్ కమిటీ చైర్మన్గా, జిల్లా పరిషత్ చైర్మన్ గా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా, ఎన్నో సేవలందించిన నాయకుడిగా అనుభవం ఉందని యువ నాయకులు ఇరగదిడ్ల శ్రీశైలం అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో ఆశీర్వదించారని, నక్కలగండి ప్రాజెక్టు, ఎస్ఎల్ బి సి, మహిళా డిగ్రీ కళాశాల, మైనార్టీలకు సంబంధించిన ఉర్దూ మీడియం కళాశాల, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీలు ఇలా చూసుకుంటే చాలా పనులు మన దేవరకొండ నియోజకవర్గానికి కావలసిన పనులు చాలా ఉన్నాయని అన్నారు. చందంపేట గ్రామ ప్రజలందరి తరపున ఎమ్మెల్యే నేనావత్ బాల నాయక్ కి మంత్రి పదవి రావాలని దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ బాలు నాయక్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఎన్నో జరుపుకోవాలని కోరుకుంటూ ఇంకా ఎన్నో పదవులు పొందాలని చందంపేట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినారు.

## స్వామి వివేకానంద జాతీయ అవార్డు

- కూరెళ్ళ రామకృష్ణ చారి

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ కు చెందిన కూరెళ్ళ రామకృష్ణచారి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ కార్యవర్గ సభ్యులుగా ప్రస్తుతం ,గత 20 సంవత్సరాల నుంచి బీసీ, స్వర్ణకారుల, సిద్ధ సమాధి యోగ,సామాజిక ఉద్యమాలు చాలామంది పేదలకు ఆర్థిక చేయూత, కరోనా సమయంలో నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ,అన్నదాన కార్యక్రమాలు వివిధ సామాజిక సేవలో చేసినందుకు గాను గుర్తించి హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి బహుజన వెస్టర్న్ రైటర్స్ ఏడవ రాష్ట్రస్థాయి సమావేశం సందర్భంగా బహుజన సాహిత్య అకాడమీ వారు అందించే అవార్డులలో భాగంగా జాతీయ చైర్మన్ నల్ల రాధా కృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డును సెలక్షన్ చేసిన రాష్ట్ర సెలెక్టెడ్ కమిటీ మెంబెర్ సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల నుంచి 200 మంది డెలిగేట్స్ హాజరయ్యారు. బహుజన అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నేను మరింత ఉత్సాహంతో సామాజిక ఉద్యమాలలో పాల్గొని ప్రజలకు చేరువై అన్ని వర్గాలను కలుపుకొని పోయి సేవ చేశానని రామకృష్ణ చారి తెలిపారు.

## నకిలీ విత్తనాలు సీజ్..

- అక్రమంగా ఎరువులు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న పోలీసులు
- మేడ్చల్ జిల్లా శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
- 800 కిలోల నకిలీ విత్తనాలు సీజ్.. ఒకరు అరెస్ట్

జయభేరి, జులై 2:




అధికారులు, పోలీస్ యంత్రాంగం ఎన్ని చర్యలు చేపట్టిన కూడ అక్రమ ఎరువుల రవాణా కు అడ్డుకట్ట పడలేక పోతుంది. తాజాగా అక్రమంగా తరలిస్తున్న నకిలీ విత్తనాల డీసీఎం వ్యాను ను సైబరాబాద్ ఎస్వోటి మరియు శామీర్ పేట్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో డీసీపీ కోటిరెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు. సూర్యాపేట నుండి బెల్లంపల్లికి డీసీఎం వ్యానులో నకిలీ విత్తనాలు అక్రమంగా తరలిస్తున్నారు . అయితే దీనిపై సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్వోటీ , శామీర్ పేట్ పోలీసులు సంయుక్తంగా కలిసి శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరెంజ్ బౌల్ చౌరస్తా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 800 కిలోల విత్తనాలతో పాటు డీసీఎం వాహనం రవాణా చేస్తున్న మల్లేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని డిసిపి కోటిరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డిసిపి కోటిరెడ్డి హెచ్చరించారు.

## నిరుద్యోగల సమస్యల పై MRO కి వినతిపత్రం

- దేవరకొండ భారతీయ జనతా యువ మోర్చా నాయకులు

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ జటవత్ ప్రకాష్ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణాలో నిరుద్యోగల సమస్యల పై MRO కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ.. నీళ్లు నిధులు నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నరనేది జగమెరిగిన సత్యం. గత BRS ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానంలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుంది. ఈ మోసలను ఎండగడుతూ తెలంగాణా యువత తరుపున, నిరుద్యోగుల తరుపున BJYM గత కొన్ని సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూనే ఉంది. అయినప్పటికీ ఈ నియంతృత్వ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా కాలం గడిపేస్తుంది, నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంది. కావున మీరైనా ఈ నిరుద్యోగ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేసినారు. BJYM రాష్ట్ర శాఖ నిరుద్యోగుల సమస్యల పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ప్రధాన అంశాలు...

1. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి. 2. గ్రూప్ 2,గ్రూప్ 3నోటిఫికెషన్లలో అదనంగా పోస్టులు పెంచాలి. 3. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలి. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను postpone చేసి నూతన తేదీలను ప్రకటించాలి. 4. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33% రిజర్వేషన్ కేటాయించాలి.. 5. పోలీసు కానిస్టేబుల్ నియామకాల అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న G.O. No. 46 ను వెంటనే రద్దు చేయాలి. 6. జాబ్ కలెండర్ ను వెంటనే రద్దు చేయాలి. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు గుండాల అంజన్న, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శంకర్, BJYM జిల్లా ఉపాధ్యక్షులు పులిజాల ఆదిత్య, గడ్డం శివ,ఫణి,తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశంలో సన్మానం

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జాన్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. విద్య, వైద్యం, ఎలక్ట్రానిక్, సాగునీరు పై అధికారులు తప్పకుండా దృష్టి సాధించాలని.. ప్రజా ప్రతినిధుల స్థానంలో అధికారులే బాధ్యత వహించాలి అని ఎమ్మెల్యే తెలియజేసినారు. ఎంపీపీ,వైస్ ఎంపీపీ, ZPTC,ఎంపీటీసీ,కోఆప్షన్ సభ్యులు పదవి విరమణ పొందుతున్న సంధర్భంగా శాలువా కప్పి,మెమోంట్ లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఎంపిడిఓ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ సంతోష్ కిరణ్ కుమార్,ఎంపీపీ జాన్ యాదవ్, వైస్ ఎంపీపీ శుభాష్ గౌడ్, ZPTC మారుపాకుల అరుణ సురేష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, CPI రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా నర్సింహా రెడ్డి, PACS చైర్మన్ Dr వేణుధర్ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, శిరందాసు కృష్ణయ్య,ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు భగవంతునితో సమానమన్న వక్తలు

- అల్వాల్ సర్కిల్ పరిధిలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం పలువురు వైద్యులకు సన్మానం



జయభేరి, జులై 2:

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా అల్వాల్ సర్కిల్ పరిధిలోని చైల్డ్ డెవలపమెంట్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ ప్రసన్న కుమారిని ఘనంగా సన్మానించారు. సమాజంలో గురువు అటు తర్వాత ముఖ్య పాత్ర పోషించేది వైద్యులే అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు రేణుక, శ్యామల, శిల్ప, నిర్మల, స్వరూప, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో సమస్యలకు కేరాఫ్ గా పాఠశాలలు

- బాబాగూడ లోని శాంతినికేతన్ పాఠశాల వార్డెన్ వేధింపులు తాళలేక ఇద్దరు విద్యార్థుల పరారీ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు... బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




జయభేరి, జులై 2:


సరస్వతి నిలయాలు సమస్యలకు కేరాఫ్ అడ్రస్ గా మారుతున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తుండటం వల్ల అటు విద్యార్థులు ఇటు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.ఇక మేడ్చల్ జిల్లాలో అయితే కొన్ని ప్రైవేట్ పాఠశాలల అరాచకాలు రోజు రోజుకు శృతి మించిపోతున్నాయి. తాజాగా శామీర్ పేట్ మండలం బాబాగూడ లోని శాంతినికేతన్ పాఠశాల లోని విద్యార్థులు యాజమాన్యం పెట్టే చిత్రహింసలకు బలి అయిపోతున్నారు. పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న వార్డెన్ రాకేష్ చదువు పేరుతో తమను వేధిస్తున్నారంటూ విద్యార్థులు వాపోతున్నారు. తాము చదవక పోతే ఇంజక్షన్ ఇస్తా మరియు కొడతా అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక పాఠశాలలో తమకు సరైన భోజనం కూడ పెట్టడం లేదని, కొన్ని సార్లు అయితే ఆహారంలో పురుగులు సైతం వస్తున్నాయంటూ పేర్కొన్నారు . దీనిపై ఫిర్యాదు కూడ చేశామని, అయినా ఎవరు కూడా పట్టించుకోవడం లేదని, వాపోయారు. కాగా దిల్ సుఖ్ నగర్ కు చెందిన లిరి, ఘట్ కేసర్ కు చెందిన హేమంత్ లు పాఠశాల వార్డెన్ వేధింపులు భరించలేక స్కూల్ ప్రహరీ గోడ దూకి అక్కడి నుంచి పారిపోయి ఇంటికి వచ్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఈ పాఠశాలపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయని, అయినా అధికారులు స్పందించడం లేదని పలువురు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# మూవీభేరి

## ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో..

నిఖిల్ నటించిన స్పై సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది ప్రిషా సింగ్. ఈ చిత్రంలో రెహ్మాన్ కూతురుగా కనిపించింది ప్రిషా సింగ్. నటిగా తనను తాను నిరూపించుకోవాలనే ప్రయత్నంలో ఉన్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం హీరోయిన్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. ప్రస్తుతం టాలీవుడ్ యాక్టర్ అల్లు శిరీష్ హీరోగా బడ్డీ సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రిషా సింగ్. ఎప్పటికప్పుడు ట్రెండీ దుస్తుల్లో కనిపిస్తూ నెటిజన్లను ఇంప్రెస్ చేసే ఈ భామ తాజాగా బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో దిగిన స్టిల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంప్రదాయ చీరకట్టులో, మోడ్రన్ డ్రెస్‌లో, ట్రెండీ దుస్తుల్లో కెమెరాకు ఫోజులిస్తూ అందరినీ ఇంప్రెస్ చేస్తోంది. స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న బడ్డీ ఫస్ట్ లుక్‌తోపాటు గ్లింప్స్ వీడియో ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది.






## సస్పెన్స్‌తో నిన్ను వదలను

రష్యా నటి లియుబా షామ్, కుష్బు జైన్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నిన్ను వదలను'. హాలీవుడ్ స్టూడియోస్, శ్రేయ ప్రొడక్షన్స్ పతాకంపై అశోక్ కుల్లర్ నిర్మిస్తున్నారు. షిరాజ్ మెహది దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశమిది. రష్యా సింగర్, ప్రొడ్యూసర్ అయిన లియుబా షామ్ ఈ సినిమా ద్వారా తెలుగులో అరంగేట్రం చేస్తున్నది. గోవా, హైదరాబాద్ నేపథ్యంలో కథ సాగుతుంది' అన్నారు. గంగాధర్, వైజాగ్ షరీఫ్, వైజాగ్ రవితేజ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్ కొమరి, దర్శకుడు: షిరాజ్ మెహది.

## ఇప్పుడేకాదు 20ఏళ్ల క్రితం కూడా ఇంతే

'అపూర్వ రాగంగళ్' నుంచి మొదలైన అపూర్వ స్నేహబంధం కమల్‌హాసన్, రజనీకాంత్‌లది. వీరిద్దరిలో కమల్ నటుడిగా సీనియరే అయినా.. కెరీర్ పరంగా బ్రేక్ అందుకుంది మాత్రం ఇద్దరూ దాదాపు ఒకేసారి. వీరిద్దరికీ గాడ్‌ఫాదర్ ఒకరే.. ఆయనే మహాదర్శకుడు కె.బాలచందర్. కెరీర్ తొలినాళ్లలో ఇద్దరూ కలిసి చాలా సినిమాల్లో నటించారు. కాలక్రమేణా నటులుగా ఇద్దరూ చెరోదారి ఎంచుకున్నారు. కమల్ విభిన్నమైన పాత్రలతో దేశం గర్వించదగ్గ మహానటుడిగా ఎదిగితే.. రజనీ మాస్ పాత్రలతో సౌతిండియన్ సూపర్‌స్టార్‌గా అవతరించారు. ఏదేమైనా ఇద్దరూ ఇద్దరే. ఇటీవల తమ స్నేహానుబంధం గురించి కమల్‌హాసన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'మేమిద్దరం ఒకే గురువు వద్ద విద్య నేర్చుకున్న శిష్యులం. అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ మా మధ్య అసూయకు స్థానంలేదు. పోటీతత్వం మాత్రమే ఉంది. దశాబ్దాల స్నేహం మాది. ఎన్నో సినిమాల్లో కలిసి నటించాం. ఒక దశలో కలిసి నటించకూడదని అనుకున్నాం. ఎందుకంటే నటులుగా మా మార్గాలు మారాయి. కానీ ఎప్పుడూ కూడా ఒకరినొకరం చులకన చేసుకోలేదు. ఇప్పుడు పెద్దవాళ్లం అయ్యాం కనుక ఇలా అంటున్నానని అనుకోవద్దు. 20ఏళ్ల క్రితం కూడా మేం ఇంతే..' అంటూ నవ్వుతూ చెప్పారు కమల్‌హాసన్.





## భాగ్యనగరిలో పుష్ప2

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'పుష్ప 2' చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ప్రేక్షకులు ఎంతగానో ఆతృతగా ఎదురుచూస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ తుదిదశలో ఉంది. హైదరాబాద్‌లో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో కొన్ని కీలకఘట్టాలను తెరకెక్కిస్తున్నారని తెలిసింది. ఇందులో హీరో అల్లు అర్జున్ కూడా పాల్గొంటున్నారని సమాచారం. 'పుష్ప' సాధించిన అఖండ విజయంతో సీక్వెల్‌పై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భారీ హైప్ నెలకొని ఉంది. ప్రచార చిత్రాలు, పాటలకు అద్భుతమైన స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com